

# ధర్మనిస్సారకమయ్యా...

ఎ. వి. సత్యప్రసాద్

జీప్ దిగి ఆ ప్రదేశం అంతా పరికించి చూశాడు రంగనాథం. చుట్టూ కొండల మధ్య — లోయల్లో ఆ ప్రదేశం అంతా పచ్చని చెట్లతోనూ, గుబురులతోనూ నిండి ఉంది. ఆ చెట్ల మధ్యనే అక్కడక్కడ గుంపులుగా వెలిసిన గుడిసెలు. ఆ గుడిసెల్లో—ఆ గుడిసెలే తప్ప వేరే ప్రపంచం ఎరగని మనుషులు.

ఒక కొండనుంచి మరొక కొండకు ఎత్తైన గట్టు కట్టే ప్రయత్నం సగందాకా వచ్చింది. ఒక కొండ చివర కూలీల బరువు మోతలు, డ్రిల్లింగ్ మెషిన్ల చప్పుళ్ళు, తనలాంటి సూపర్‌వైజరే ఆజమాయిషీ చేస్తున్నట్టు కేకలు. అది వేరే డిపార్ట్‌మెంటువారి పని కాబోలు.

చాలా ఎత్తునుండి చూస్తున్న రంగనాథానికి ఆ లోయల్లో చెట్లు ఎంత ఎత్తుగా ఉన్నా, చాలా క్రిందగా ఉన్నట్టూ, చిన్నవిగా ఉన్నట్టూ కనిపిస్తున్నాయి. ఈ ప్రకృతి రామణీయకతను అనుభవంద్వారా ఆనందించడమే కానీ, వర్ణించలేని స్థితిలో పడ్డాడు రంగనాథం.

మై మరిచి దూరంగా అంతా పరిశీలిస్తున్న రంగనాథం ఏకాంతానికి అంతరాయం కలిగిస్తూ పలకరించారు కరణంగారు.

"నమస్కారం, బాబూ! తమరు నిన్ననే వస్తారని మాకు వర్తమానం అందింది. నిన్నంతా మీకోసం ఎదురు చూశాం. మీకు ఒక గదీ, స్టౌ, వంటకు సరిపడా సామానంతా సిద్ధం చేశాం. వారం రోజుల క్రితం మీ సూపరింటెండెంటు గారు తమరు స్వయంగా వండుకుంటారనీ, ఎక్కడా భోజనం చేయరనీ చెప్పారు. మీరు ఒకసారి దయచేస్తే ఏర్పాట్లు ఎలా ఉన్నాయో చూసుకోవచ్చు."

రంగనాథం కొంచెం ఆశ్చర్యపోయినా, ఇంత మారుమూల అడవి ప్రదేశంలో మంచి ఏర్పాట్లు జరిగినందుకు లోలోపల సంతోషించి, "పదండి!" అన్నాడు. నిజానికి అతనికి తాను ముందుగా వస్తున్నట్టు మరొకళ్ళకు తెలియడం ఇష్టం లేదు. సాధ్యమైనంతవరకు గుప్తంగా ఉంచి, స్వయంగా వచ్చి, విశేషాలన్నీ తెలుసుకున్న తరవాత డ్యూటీలో చేరడం ఇష్టం. కానీ, ప్రతిచోట తన ఇష్టప్రకారమే పనులు జరగవు. తన డిపార్ట్‌మెంటులో ఏదో ఒక పనిమీద ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. ఎస్. ఇ. గారు తన రాక గురించి ముందే చెప్పి ఉంటారని అనుకున్నాడు.

నడుస్తూ కరణంగారు చెపుతున్నారు:

"బాబూ! ఈ జలాశయ నిర్మాణం చేపట్టి దానికి పది సంవత్సరాలు పట్టిందండి. మొట్ట మొదట చిన్న చిన్న గూడేలలో వాళ్ళెవరూ ఒప్పుకోలేదండి. ఇక్కడికి పై అధికారులు ఎవర్నీ రాకుండా అటకాయించేవారు. నేను ఇక్కడికి దగ్గరలోనే ఉన్న చలమేరు గ్రామానికి కరణంగా ఉంటే, ఈ మొత్తం గుడిసెలు ఉన్న ప్రతి గూడేనికీ నన్నే కరణంగా పెట్టి మొత్తం లాండంతా




అందానికి, మన్నికకు
అమర్
గోల్డు కవరింగు
ఆభరణములనే
ధరించండి
5 సం॥లు గ్యారంటీ

సంప్రదించండి

తిరుపతి, తిరుమలలో వివాహాది శుభకార్యాలకు, మరియు తిరుపతి నుండి దేశములో నలుమూలలా ప్రయాణము చేయుటకు విమానం, రైలు, బస్సు వగైరాలకు మీకు కావలసిన విధముగా టిక్కెట్లు ఏర్పాటు చేయగల ఏకైక సంస్థ, ఈ రోజే వివరములకు మమ్ములను సంప్రదించండి.

తిరుపతి ట్రావెల్స్,
రైల్వేస్టేషన్ ఎదురుగా, తిరుపతి.
ఫోన్: 3204, గ్రామ్స్: "TRUPTI"

క్రొత్త శీఘ్ర-చర్యగల సూపర్
వాస్‌మోల్ 33
తెల్ల వెంట్రుకలు పూర్తిగా మరియు సహజంగా నల్లబడుతాయి...
కేవలం 3 రోజుల్లో
సూపర్ వాస్‌మోల్ 33 వైజ్ఞానిక పద్ధతిలో తయారు చేయబడిన జిడ్డులేని హెయిర్ ఆయిల్. ఇది మీ వెంట్రుకలను ఎల్లప్పటికీ ఆరోగ్యంగా, నల్లగా, నిగనిగలాడేలా వుంచుతుంది.




హైజీనిక్ రిసెర్చ్
ఇన్‌స్టిట్యూట్
పి. ఒ. బాక్స్ 1192
బొంబాయి 400 001
అన్ని కెమిస్టు దుకాణాలలో మరియు మీకు చేరువలోనున్న ప్రముఖ దుకాణాలలో లభిస్తుంది.

ఎస్టిమేషన్ చేయించారండి. నేను నింపాదిగా వచ్చుచెప్పి, ఈ గుడిసెలన్నీ ఖాళీ చేయించడానికి అందర్నీ ఒప్పించానండి. వీళ్ళందరికీ నేనంటే గురండి.''

ఏదో యాంత్రికంగా వింటున్నాడు గానీ, ఇదంతా ఎందుకు చెబుతున్నాడో గ్రహించలేదు రంగనాథం. కరణంగారు మాటను అక్కడితో ఆపివేయడంతో, తల ఎత్తి చూశాడు.

కరణంగారు చిన్నగా నవ్వి, కళ్ళ జోడు సవరించుకున్నాడు. రంగనాథం ఏదైనా మాట్లాడతాడేమో అని ఎదురు చూశాడు కరణం. ఏమీ మాట్లాడకపోయేసరికి తనే రంగనాథాన్ని ప్రశ్నించాడు.

''తమరు పని సగం పూర్తయిన తరవాత వచ్చారు. ముందే వచ్చి ఉంటే మీకు బాగా ఉండేది. ఇన్నాళ్ళూ తమరు ఎందుకు రాలేదు?''

''రావడం నా ఇష్టంమీద ఆధారపడి ఉంటుందిటండీ? నేను డివిజన్ మారి మూడు నెలలయింది. వచ్చిన తరవాత ఇక్కడ చాలా గొడవలుగా ఉన్నాయనీ, మరో సూపర్‌వైజరు అవసరమనీ నన్ను పంపించారు. నేను ఎడిషనల్ హాండ్ అనుకుంటే, అసలు మొదటి ఆయనే ఇక్కడ లేరని ఇక్కడికి వచ్చాక తెలిసింది.''

''అప్పుడండి ముందు ఒకాయన ఉండేవాడు. ఇక్కడ గూడెంవాళ్ళతో తగువుపడ్డాడు. ఆ మరునాడు పొద్దున్నే వెళ్ళిపోయి, వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయించేసుకున్నాడు. మళ్ళీ రాలేదు.''

''గూడెంవాళ్ళతో తగువా? వాళ్ళకూ, ఇతనికీ ఏమిటి సంబంధం? తగువు తెచ్చుకునేటంత పరిస్థితి ఎందుకు వచ్చింది?'' కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు.

''ఏముంది, బాబూ! ఇక్కడ అడవుల్లో దుంగలు, పట్టుతేనె, చింతపండు, కొండచీపుళ్ళు, కుంకుడుకాయలు—ఎన్నో దొరుకుతాయి. ఈ గూడెంవాళ్ళంతా అడవుల్లోకి పోయినప్పుడు అన్నీ తెచ్చి పెట్టమనేవాడు. వాళ్ళు తెచ్చిపెట్టేవారు. తరవాత అవన్నీ అతను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడని తెలిసింది. 'మీ కుటుంబానికైతే పూరికే ఇస్తాము గానీ, మీరు మీ కష్టంతో సొమ్ము చేసుకుంటే ఇవేమీ ఇయ్యం, దొరా!' అని చెప్పారు. దానితో మాటా మాటా పెరిగింది. 'ఈసారి అగుపిస్తే రగతం కళ్ళసూస్తా'మని బెదిరించారు. ఆయన మళ్ళీ ఇటేపు రాలేదు'' అని కరణంగారు ఆపుచేసి, రంగనాథం వైపు చూశారు.

రంగనాథం పాత సూపరువైజర్ని మనస్సులో అసహ్యించుకున్నాడు. ఈ కొండవాళ్ళ న్యాయం ఏమిటో తెలుసుకున్నాడు. ఒకళ్ళ కష్టం మరొకళ్ళు దోచుకొని బ్రతకడం వాళ్ళకు కిట్టదు. ఒకడి కుటుంబానికి సహాయం చేస్తారు గానీ, వ్యాపారానికి చచ్చినా చెయ్యరు. వాళ్ళ కట్టుబాటు అలాంటిది. ఇందులో రంగనాథానికి తెలియని, అర్థంకాని సంఘనీతి ఎంతో ఉందనిపించింది.

''మా డిపార్టుమెంటువాడైనా సరే, కరణంగారూ, మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే తప్పంతా మా సూపరువైజరుదే. కొండవాళ్ళ వాదనలో ఎంతో న్యాయం ఉంది'' అన్నాడు కొంచెం ఆవేశంగా.

కరణంగారు నిట్టూరుస్తూ, "ఏం న్యాయం, బాబూ! ఎవరి న్యాయం వారిది. ఎవరి బాగు వారిది. ఈ ప్రపంచంలో జరిగే వాటిని చూస్తుంటే న్యాయం, అన్యాయం నిర్ణయించే శక్తి మనకు లేదనిపిస్తూంది. ఉన్నంతవాడికి సాగు చేసుకుని, మన బాగు మనం చూసుకుని, అవకాశం ఉన్నంత వరకు బాగుపడి పోవడమే మంచిది!" అన్నాడు.

ఇందులో రంగనాథానికి కొత్త సందేశం ఏదో ధ్వనించింది. కరణంగారి రాటుదేలిన అనుభవం వ్యంగ్యంగా రంగనాథానికి హితబోధ చేస్తూంది!

ఎందుకో రంగనాథానికి ఈ మాటలు రుచించలేదు. అందుకని మౌనంగా ఉండిపోయాడు, సంభాషణ పొడిగించడం ఇష్టంలేక. రంగనాథం మౌనంగా ఉండిపోయేసరికి కరణంగారికి రంగనాథం అంతర్యం అంతుబట్టలేదు. కొంతమంది మాటలవల్ల అంతర్యం బయటపడితే, కొంత మంది వ్యవహారాలవల్ల అంతర్యం బయటపడుతుంది. రంగనాథం బహుశా రెండవ కోవకు చెందిన వాడేమో? పైగా 'మౌనం అంగీకారం' అన్న సూత్రం ఉండనే ఉందికదా? ఫర్వాలేదు—' అనుకున్నారు కరణంగారు.

రంగనాథానికి వసతి గదీ, వంట సామగ్రి అన్నీ చూపించి, ఏమైనా కావాలంటే కబురు పంపమని కరణంగారు సెలవు తీసుకున్నారు.

మరునాటి కార్యక్రమాన్ని తలుచుకుంటూ, చుట్టూ దట్టమైన చెట్లమధ్య, చీకట్ల మధ్య ఒక గదిలో ఒంటరిగా నిద్రకు ఉపక్రమించాడు రంగనాథం.

* * * *

సర్వే రిపోర్టును చేతో పట్టుకుని, మాపు ద్వారా అక్కడ ఉన్న స్థలాలనూ, చెట్లనూ గుర్తించసాగాడు, ఇద్దరు నౌకర్ల సహాయంతో రంగనాథం. జలాశయ నిర్మాణం ఇవతలి భాగంలో కుడిచేతివైపు ఉన్న పొలాల్నీ, చెట్లనీ కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆ గుడిసెల లోని వాళ్ళందరూ ఎందుకు కోరుకున్నారో అర్థం కాలేదు. అదే విషయాన్ని రంగనాథం కరణంగారిని అడిగాడు.

"ఏముంది, బాబూ! నీటిమట్టం అంచనా ఎప్పుడైనా తారుమారైతే—గట్టుదాటి నీరు పార్లిపోతే—ఇవన్నీ కూడా మునిగిపోతాయి కదా? అప్పుడు ఈ భూముల్ని నమ్ముకుంటే వ్యవసాయం గడవదని, ఈ చుట్టూ పొలిమేరదాకా—అల్లదుగో— ఆ కనిపించే స్తంభం దాకా ఉన్న భూముల్ని ప్రభుత్వంవారు స్వాధీనం చేసుకోవాలని ఈ గూడెం వాళ్ళంతా తీర్మానం చేసుకున్నారు, బాబూ! ఈ పెళ్ళనేభూములు కూడా " అన్నారు.

రంగనాథం ఆశ్చర్యంగా చూశాడు. కొంచెం నవ్వుతూ, "నిజం చెప్పండి, కరణంగారూ! ప్రభుత్వం మూడు వైపులా మూడు విశాలమైన, వెడల్పైన కాలువలు తవ్వించి, నీటి మట్టాన్ని అదుపు చేయడానికి లోపల లాక్స్‌కూడా ఏర్పాటు చేసిందికాదా? మన ఇంజనీర్లు అటూ పోటూ అన్నీ దృష్టిలో పెట్టుకునే జలాశయ నిర్మాణానికి ఉపక్రమిస్తారు కదా? భూమి, ఈ భూములూ, చెట్లూ మునిగి పోతాయని వారికి తెలియకనా? వారు వూహించి ఉండరా? నిజంగా ఇలా తీర్మానం చేసుకోవాలన్న ఆలోచన ఈ గూడెం వాళ్ళకే వచ్చిందంటారా?" అన్నాడు.

కరణంగారు నవ్వారు. ఆ నవ్వులో లౌక్యం ఉంది. 'పిల్ల కాకివి— నీ కేం తెలుసు?' అన్న ఎగతాళి ఉంది. రంగనాథం మనస్సు కొంచెం చివుక్కుమన్నా ఏమీ ఎరగనట్టే ఆయన వైపు చూశాడు.

కరణంగారికి కూడా రంగనాథం ఏమీ అంతు బట్టకుండా పోతున్నాడు. అత నడిగే ప్రశ్న నిజంగా అమాయకంగా ఉందో, లౌక్యంగా ఉందో, గడుసుదనంగా ఉందో తెలియడం లేదు. లౌక్యంగా, గడుసుతనంగా ఉండే వాడయితే ఇలాటి ప్రశ్న వేయడు. అమాయకుడైతే—"ఈ ఆలోచన గూడెం వాళ్ళకే వచ్చిందంటారా?" అని అడగడు. ఏది ఏమైనా రంగనాథానికి ఉన్న విషయం చెప్పేస్తే అతని రియాక్షన్ బట్టి అతనిని అర్థం చేసుకోవచ్చని ఆశ పడ్డారు కరణంగారు. కరణంగారు చెప్పడం ప్రారంభించారు.


"అసలు ఇంత ఆలోచన ఈ గూడెం వాళ్ళ కెక్కడిది, బాబూ! పై నుండి ఎందరో దొరబాబులు వస్తూ పోతూ ఉంటారు కదా? వాళ్ళూ, ఈ గూడెం వాళ్ళూ అందరూ కలిసి, ఒక పాకలో కూర్చుని ఆలోచించుకుంటారు. ఈ గూడెం వాళ్ళంటే ప్రభుత్వంలో పెద్ద అధికారు లందరికీ మంచి గురండి. అందుకని వీళ్ళేం తీర్మానం చేసినా ఆమోదిస్తారు. మీకు అసలు విషయం చెప్పేస్తున్నాను, వినండి. ఇక్కడ ఈ జలాశయ నిర్మాణం లేకపోతే ఈ భూముల్నీ, చెట్లనీ,పుట్లనీ కొనేవాడే ఉండడండి. ఇదంతా మారుమూల అడవికొయ్య. ఈ భూములకు పెద్ద రేటంటూ ఏమీ లేదండి. ఈ భూముల్ని నమ్ముకుని పొట్ట పోషించుకునే వాళ్ళే ఈ గూడెంలోని కోయలూ, చెంచులూ. ప్రభుత్వం జలాశయ నిర్మాణం చేపట్టిన తరవాత ఈ గూడెం జవాబుతో ఎవరికి ఎంతెంత పొలం ఉందో, ఎన్నెన్ని చెట్లు ఉన్నాయో అన్నీ లెక్కలు వ్రాయించి,తనిఖీ చేయించి ఎకరానికి ఆరు వేలు చొప్పున, చెట్లకు—మామిడి చెట్టయితే రెండు వందలూ, తాటిచెట్టయితే నూట ఏభై, టేకు, ఎర్ర చేవ మొదలైన చెట్లయితే రెండువందల యాభై, చిన్న చెట్లయితే వంద —ఇలా రేట్లు పెట్టి ఎవరికి ఎంతెంతసొమ్మువస్తుందో చెప్పాలో మొత్తం చెబుతున్నారండి. అయితే ఈ గూడేలలో ఉన్నవాళ్ళు ఒక్కొక్కళ్ళకు ఇంతింత డబ్బు కళ్ళ జూడ్డం ఇదే మొదటిసారి. వీళ్ళకు వచ్చే డబ్బులో అధికారుల దగ్గిర నుంచి అందరికీ వాటాలూ వంతులూ ఉన్నాయండి. వాళ్ళ దగ్గర ఉన్న డబ్బుకు ఆశ పడి వీళ్ళందరికీ మరి కొంత సొమ్ము ముట్టచెబుతామని కొందరు దొరబాబులు ఈ గూడెం వాళ్ళందరి చేత అర్జీలు పెట్టించి మీరు చెప్పిన ఈ భూముల్నికూడా స్వాధీనం చేయిస్తున్నారండి!"

రంగనాథం నిర్విణ్ణుడయిపోయాడు. "ఏమిటి? ఇది నిజమా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునండి. ఈ నష్ట పరిహారం సొమ్ము ప్రభుత్వం ఇచ్చేదంతా ఈ గూడెం వాళ్ళ చేతికి అందుతుందను కుంటున్నారా? చూడండి, బాబూ! మరెవ్వరితో అనబోకండి. ఇందులో చాలా లెక్క లున్నాయండి. నా మటుకు నాకు వాళ్ళకు వచ్చే సొమ్ములో నూటికి ఐదు రూపాయల వంతు ఉందండి. తరవాత పై అధికారులకు వాళ్ళ వాళ్ళ తరహాలను బట్టి ఐదు నుండి పాతికరూపాయల దాకా వాటా లున్నాయండి!" అన్నాడు.

రంగనాథం నిస్తబ్దంగా వింటున్నాడు. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. తను వచ్చిన పని నిజంగా ప్రభుత్వం పని కాదని అనిపించింది. తను చేస్తున్నపని—ప్రభుత్వం తరఫున అక్షరాలా ఉత్తర్వులను శిరసావహించటం. కానీ, లోపాయకారీగా కొందరు 'యంత్రాంగం లోని స్వార్థపరుల కోసం' కీలుబొమ్మగా ఉపయోగ పడటం.

అతని మనస్సు క్షణం సేపు క్షోభించింది. కరణం



గారు రంగనాథాన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు. కరణంగారి అంచనా ప్రకారం రంగనాథంకూడా, ఏదో రేటు పలక్క పోడనీ, అతని రేటేదో నిర్ణయం జరిగిన తరవాత మిగతా అధికారుల మామూలు రేట్లుకూడా నిర్ణయించి, ఆ గూడేలలో ఉంటున్న కోయలతోనూ, చెంచులతోనూ మాట్లాడి ఒక్కొక్క కోయవాడికి ఎంతెంత రావాలో నికరంగా రేటు తేల్చి, మొత్తం అంతా ఇంత సొమ్మని ఖరారు చేసుకుని అది ప్రభుత్వం వారికి అందజేద్దామని కరణంగారి సంకల్పం.

రంగనాథం ముఖంలో మార్పు గమనించి కరణం గారు నిట్టూర్చారు. 'కొత్తగా వచ్చిన కుర్ర ఆఫీసరు కదా! అప్పుడే ఏం తేలతాడులే!' అనుకుని మౌనంగా ఊరుకున్నారు.

రంగనాథం — "కరణంగారూ! ఇది చాలా అన్యాయం!" అన్నాడు కొంచెం బాధగా.

కరణంగారు ఏమీ తెలియని వాడిలా—"ఏమిటి, బాబూ?" అన్నాడు.

"చెబుతా వినండి! ఒకటి—ప్రభుత్వానికి అక్కర లేని భూమిని ప్రభుత్వం చేత కొనిపించడం. రెండు —కొందరి వాటాల కోసం ప్రభుత్వంలో ఒక డిపార్టు మెంటును ఇక్కడ పెట్టించి సర్వే చేయించడం. మూడు—ప్రభుత్వం వాళ్ళిచ్చే సొమ్ముని అందరూ పంచుకు తినడం!" కొంచెం నిష్కర్షగా, కటువుగా చెప్పాడు రంగనాథం.

కరణంగారు లోపల నవ్వుకున్నారు. ఇందాకటి నుంచీ అంచనా తెలియని మనిషిని తేలికగా అంచనా వేసేశారు.

"మీరు భలేవారే!" అని మాత్రం పైకిఅన్నారు

రంగనాథానికి ఇక ఇక్కడ ఉండ బుద్ధి కాలేదు. కరణంగారు వివరాలన్నీ చెప్పిన తరవాత తను ఎక్కడ ఆ ఊబిలోకి దిగాలో అన్న భయం పట్టు కుంది.

అతను నించున్న ప్రదేశం అంతా చుట్టూ కలయ తిరిగి చూశాడు. శాఖోపశాఖలుగా విస్తరిల్లి ఎంతో నీడనూ, ఫలాలనూ ప్రసాదించే పెద్ద పెద్ద వృక్షాలు, తాటిచెట్లు, ఈతచెట్లు, ఇంకా రకరకాల చెట్లూ ఆ భూమి నిండా పరచుకొని ఉన్నాయి. వాటి ఖరీదు అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాలి. ఆ చెట్లన్నీ తన చేతుల మీదుగా నేలమట్టం చేయాలి. ఇది ప్రభుత్వపరంగా ఆదేశం తనకు. కానీ, ప్రభుత్వానికి కూడా తెలియని విధంగా వేరే ప్రయోజనం ఉంది ఈ పనివల్ల.

భగవంతుడు ఈ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగానే ఎందుకు జరిపిస్తున్నాడో అర్థంకాలేదు. విధ్యుక్తధర్మ నిర్వహణలో పాప పుణ్యాలకు గాని, మంచి చెడ్డలకు గాని ఆలోచన చేయకూడదనీ, భారం అంతా తన పైన వేసి విధి నిర్వహణ చేయమనీ అర్జునుడికి గీతోపదేశం చేశాడు శ్రీకృష్ణ పరమాత్మ. తాను ఇప్పుడు కేవలం విధ్యుక్త ధర్మ నిర్వహణలో ఉన్నా, ఇది ప్రభుత్వం వారికి తెలియని విచిత్ర పరిస్థితి. అధర్మాన్ని ధర్మంగా మార్చే ప్రయత్నం. స్వార్థాన్ని సాంఘిక ప్రయోజనాలకు ముడిపెట్టే తాపత్రయం. ఇందులో తను ప్రధాన పాత్రధారి.

రంగనాథం మనస్సు చలించిపోయింది. తనకు ఆ డిపార్టుమెంటు కాక, మరో డిపార్టుమెంటుకు బదిలీ అయితే బాగుండు ననుకొన్నాడు. ఏదో విధంగా ఈ 'కాండ'ను ఆపు చేయించి, తన డిపార్టు మెంటును ఈ అడవుల్లో ఎత్తించేస్తే ప్రభుత్వానికి చాలా ఖర్చు కలిసి వస్తుందనీ, కొన్ని నిధులు దుర్వినియోగం కాకుండా అడ్డుపడిన వాడి నవుతాననీ అనిపించింది. పైగా అధర్మాన్ని "దక్షులెవ్వార లుపేక్షచేసి రది వారల చేటగు గాని" అన్నారు. అధికారంలో ఉండి, తను చేయగలిగి ఉండి కూడా ఏమీ చేయలేని వాడిలా, చేతకాని వాడిలా చూస్తూ ఊరుకుంటే? ఇక ఆలోచించలేక పోయాడు.

రంగనాథం తను ఉన్న గదిలోకి వచ్చాడు. మంచం మీద నడుము వాల్చి ఆలోచించాడు. ఇక్కడ వీళ్ళు పెట్టుకున్న అర్జీని ప్రభుత్వం పరిశీలించ నవసరం లేదనీ, ఈ భూములకు జలాశయ నిర్మాణం వల్ల వచ్చే నష్టం ఉండబోదనీ, ఆ భూములు ఎవరివి వారికే ఉంచేస్తే వారికి నష్ట పరిహారం


పైగా బహుమానము రూపాయలు 1,00,000

సులభంగా ఎలా
అదృష్టమును
పొందగలరో చూడండి.

వైశ్యా బ్యాంకు
స్వర్ణోత్సవపు క్యాష్ సర్టిఫికేట్లు!
నేడే మా నూరు రూపాయల
క్యాష్ సర్టిఫికేట్లను కొనండి.
అది కేవలం 63 నెలల్లో
ఎలా రు. 152/50గా
పెరుగుతుందో గమనించండి.
10% వడ్డీని మాత్రమేకాక
సిరిసంపదలను పొందండి

ది వైశ్యా బ్యాంకు లిమిటెడ్
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు
72, సెయింట్ మార్క్స్ రోడ్డు, బెంగుళూరు-560 001

ఛైర్మన్ : టి. కె. కె. భగవత్

ఇవ్వవక్కర లేదనీ ప్రభుత్వానికి సిఫారసు చేద్దామను కున్నాడు.

అయితే ఎందరో పెద్దలు ఆలోచించి, భాగాలూ, కూడికలూ, గుణకారాలూ వేసుకుని ప్రభుత్వానికి పెట్టుకున్న అర్జీని తాను ఒక్కడూ వ్యతిరేకిస్తే — ఎందరికో శత్రువు అవుతాడు. పరి కదా, ఆ అడవుల్లో కిట్టని వాళ్ళు తనను ఏమైనా చేయగలరేమో అని భయపడ్డాడు. పైగా ఆ అమాయకులైన చెంచులకూ, వాళ్ళ నాయకులు చెప్పిందే గురి. వాళ్ళ నాయకులు ఈ కరణం గారు చెప్పినది వింటారు. ఇప్పుడు ఈ కరణం గారికి నచ్చ చెబితే తన కీ అవస్థ తప్పుతుందేమో? ఎవరినీ నొప్పించకుండా ప్రయత్నం చేద్దామనుకున్నాడు.

ఆ మరునాడు కరణంగారు "నమస్కారం, బాబూ!" అంటూ రంగనాథం ఉన్న గదిలోకి ప్రవేశించారు.

"రండి, కరణంగారూ! మీతో ముఖ్యమైన విషయం మాట్లాడదాం అనుకుంటున్నాను" అన్నాడు రంగనాథం.

కరణంగారు లోపల సంతోషించారు. అబ్బాయి దారిలో పడుతున్నాడన్న ఆశ కనిపించింది ఆయనలో. "చెప్పండి తప్పకుండాను!" అన్నాడు.

"ఈ సర్వేనీ, భూముల్ని స్వాధీనం చేసుకోవడాన్నీ ప్రస్తుతం నిలుపు చేయమనీ, జలాశయ నిర్మాణం పూర్తయిన తరవాత పునరాలోచించవచ్చనీ ప్రభుత్వానికి సిఫారసు చేద్దామనుకుంటున్నాను. మా డిపార్టుమెంటును కూడా ప్రస్తుతం తీసి వెయ్యమని వ్రాద్దామనుకుంటున్నాను" అన్నాడు.

కరణంగారు క్షణంసేపు నివ్వెరపోయాడు. ఎందరో అధికారులూ, కోయలూ, చెంచులూ, తనూ కలిసి ఆశ పెట్టుకున్న సౌధాన్ని ఇతను కూల్చి వేస్తున్నట్టు భావించాడు. ఏం మాట్లాడాలో తోచ లేదు.

"బాబూ! మీరు నిదానంగా ఆలోచించి చెయ్యండి, ఏ పని చేసినా. మేమెంతో కష్టపడి, అర్జీలు పంపి, ప్రభుత్వం వారిని ఒప్పించాం. మీ పైఅధికారులందరి తోనూ చర్చలూ, మంతనాలూ, రాయబారాలూ, బేరసారాలూ—అన్నీ అయిపోయాయి. చివరి దశలో మీ 'ముద్ర'తో పనిపూర్తి కావడం కోసం మిమ్మల్ని ఇక్కడ వేశారు. మీరు ఇప్పుడు మరోలా చేస్తే ఎందరికో రావలసిన సొమ్ముకు అడ్డు తగిలిన వారవుతారు..ఎందరికో కోపం తెప్పించిన వాళ్ళవుతారు. ఈ కోయలలో, చెంచులలో ఇలాంటిది ప్రమాదకరం!"


"హెచ్చరిస్తున్నారా?"

"హెచ్చరిక, కాదు, బాబూ! నిజం. కావాలంటే చూడండి!" అన్నాడు.

"చూడవలసిన పని లేదండీ. నాకో చిన్న సహాయం చేసి పెట్టగలరా?" అని అడిగాడు రంగనాథం.

కరణంగారు విస్మయంగా —"ఏమిటి?" అన్నాడు.

"రేపు ఈ గూడెపు నాయకులను పరిచయం చేయండి. వాళ్ళతో నా అభిప్రాయాలు చెబుతాను. మీరు కూడా రండి అక్కడికి. వాళ్ళు ఒప్పుకుంటే



ఈ కార్యక్రమం నిలుపు చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాము!" అన్నాడు.

కరణంగారు నవ్వుకుని "అలాగే, బాబూ, తప్పకుండా! రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఆ గూడెం వైపు మళ్ళే దోవలో మొదటి పాక దగ్గరికి రండి. అందరం అక్కడ ఉంటాం" అన్నారు.

మరుసటిరోజు సాయంత్రం ఆ మొదటి పాక దగ్గరికి అనుకున్న సమయానికి వెళ్ళాడు రంగనాథం. పది మంది కోయదొరలూ, చెంచుదొరలూ అక్కడ కూర్చుని ఉన్నారు. వాళ్ళంతా ఎందుకో ఇతనివైపు గురగుర చూడటం మొదలుపెట్టారు. ఇతనిరాకను గాని,ఉనికిని గాని ఎవరూగుర్తించినట్టు లేదు. కరణం గారు వచ్చినట్టు లేదు. కరణం గారి కోసం అటూ ఇటూ చూశాడు. పాక లోపలికి దూరాడు. అనువుగాని చోట అధికుల మనరాదు' అన్నసూక్తిని జ్ఞాపకం చేసుకుని తనే అక్కడి గూడెం దొరలకు నమస్కరించాడు. వాళ్ళు ప్రతిగా ఏమీ మాట్లాడ లేదు సరిగదా— ముఖం చిట్లించి వూరుకున్నారు. బయటికి వచ్చి అటూ, ఇటూ పచార్లు చేస్తూ ఒక పావు గంట గడిచే సరికి కరణం గారు దూరంగా కనిపించారు. మనస్సులో కొంచెం ఆరాటం తగ్గింది.

కరణంగారు వచ్చి, "రండి!"అని లోపలికి తీసుకొని వెళ్ళారు. లోపల ఒక బల్లమీద కూర్చుని అందర్నీ పరిచయం చేసుకున్నాడు రంగనాథం. కరణంగారు గూడెం దొరలను ఉద్దేశించి, "ఈ బాబుగారు మీ భూములు స్వాధీనం చేసుకోవడం ఇష్టం లేదట. మీతో మాట్లాడతారట!" అన్నాడు.

అందులో ఒక కోయదొర లేచి అతని భాషలో (తెలుగు భాషే — అయినా అర్థం కాని భాష) కరణం గారితో ఏదో అన్నాడు. దాని తాత్పర్యం కరణంగారు రంగనాథానికి వివరించారు. "మీ పై అధికారులూ, చివరికి కలెక్టరు గారు కూడా స్వాధీనం చేసుకోవడానికి అర్డర్లు పాసు చేశాక మీరెవరు వద్దనడానికి?"

రంగనాథం కొంచెం తొట్రుపాటు పడ్డాడు. ఇటువంటి ప్రశ్న ఈ కోయదొర ద్వారా వస్తుందని వూహించలేదు. అయితే ఈ ప్రశ్నలన్నీ కరణం గారే ముందే 'తయారు' చేసి ఉంచవచ్చని భావించాడు.

"ప్రభుత్వం వారు ఆర్డర్లు పాసు చేసినా పరిస్థితిని బట్టి నిలుపు చేసే అధికారిగా నాకు ఉందని చెప్పండి, కరణం గారూ!" అన్నాడు ఇతను మాట్లాడే తెలుగును వాళ్ళు అర్థం చేసుకో గలరు. వెంటనే అక్కడి జనంలో కలకలం బయలు దేరింది.

రంగనాథం మళ్ళీ అన్నాడు వాళ్ళను ఉద్దేశించి

"మీరంతా నే చెప్పేది జాగ్రత్తగా వినండి. ఇప్పటికే జలాశయంలో మునిగిపోయే భూములకు రావలసిన డబ్బు మీకు పూర్తిగా అందింది. జలాశయం ఇవతలి భాగంలో ప్రభుత్వానికి అక్కరలేని మీ భూములను ప్రభుత్వాన్ని కొనమని మీరు అర్జీలుపంపడంఏమైనా న్యాయంగా ఉందా?దీనివల్ల ప్రభుత్వానికి ఎంతో నష్టం. మా డిపార్టుమెంటుని పోషించడానికి అదనపు ఖర్చు, మీకు కూడా మళ్ళీ సేద్యం చేసుకోవడానికి భూములు ఉండవు. బాగా ఆలోచించండి."

కోయదొరలంతా చాలా గందరగోళం చేశారు. వాళ్ళలో వాళ్ళు ఏమేమో మాట్లాడుకున్నారు. రంగనాథం వైపు చూస్తూ కోపంగా అరిచారు. ఒక గంట రభస జరిగింది. ఈ రభస సారాంశమేమిటంటే—

'జలాశయ నిర్మాణం పూర్తి అయ్యేవరకు ఈ భూమి ప్రస్తుతం సాగు లేకుండా ఉంటుంది.నిర్మాణంపూర్తి అయిన తరవాత గానీ, సాగుకు పనికిరాదు. ఈ జలాశయ నిర్మాణం పూర్తి కావడానికింకా సుమారు ఐదారు సంవత్సరాలు పడుతుంది.అప్పటి దాకా ఈ భూమి వల్ల ఈ కోయలకు ఏ ప్రయోజనమూ ఉండదు. అందువల్ల ఈ భూమినికూడా ప్రభుత్వానికే అమ్మి వేస్తే నిర్మాణం పూర్తి అయిన తరవాత మళ్ళీకొనుక్కోవచ్చు. వీలుంటే అదే రేటుకు లేదా వీలైనంత తక్కువ ధరకు. అప్పటికి ఈ భూమికి — జలాశయం పక్కనే ఉండటం వల్ల గిరాకీ పెరుగుతుంది. ప్రైవేటు వాళ్ళకేనా అమ్మితే రెట్టింపు లాభం రావచ్చు. కాబట్టి ఈ అయిదేళ్ళూ ఆ భూములను ఖాళీగా

ఉంచేకంటే, ప్రభుత్వానికి అమ్మితే కొంత డబ్బు వస్తుందని అందరూ కలిసి ఆలోచించుకుని చేసిన తీర్మానం అది. 'మీరు దీనిని వ్యతిరేకించి, డబ్బు రాకుండా ఆటంకపరచేరంటే, మీపై అధికారులకు ఫిర్యాదు చేస్తాం. జాగ్రత్త!'—అని.

ఇలా గొడవ జరిగిందో, లేదో మరునాటి సాయంత్రానికల్లా రంగనాథం పై అధికారులందరూ జీప్‌లో దిగారు. అందులో చెప్పుకోదగ్గ పెద్ద అధికారులే ఉన్నారు. వీళ్ళంతా రంగనాథంతో—ఇచ్చిన ఆర్డర్సుకు వ్యతిరేకంగా పని చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయనీ. ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండా పై నించి అందే ఉత్తర్వులను అమలు చేయమనీ, ఏ మాత్రం మళ్ళీ ఫిర్యాదులందినా కఠినమైన చర్యను తీసుకోవలసి ఉంటుందనీ హెచ్చరించి వెళ్ళారు.

రంగనాథం కొయ్యబొమ్మ అయిపోయాడు.

రంగనాథానికి అనుభవంలో లేని విషయాలు చాలా అనుభవంలోకి వస్తున్నాయి. తను నిస్సహాయుడు. ఇక్కడి వీళ్ళంతా ముందే అన్నీ ఆలోచించి పెట్టుకున్నారు. తనేమీ చేయలేడు. కేవలం యంత్రంలో ఒక భాగం మాత్రమే! ఇప్పుడు ఇక్కడ పేచీ పెట్టుకున్నా తనకే ప్రమాదం.క్షణం సేపు ఆలోచనలో పడ్డాడు. కరణంగారు గట్టివాడే అన్నాడు. ఆయన పలుకుబడి అసామాన్యమైనది. ప్రభుత్వోద్యోగిగా వచ్చిన పని చెయ్యడమే తప్ప శరణ్యం లేదనుకున్నాడు. వివాదాలు పెట్టుకోవడం విరమించుకున్నాడు. దైవ నిర్ణయం ఎలా ఉంటే అలాగే చేద్దాం అనుకున్నాడు.

ఒక రోజు కరణంగారు నసుగుతూ "మరి... మీరు మీ రేటు విషయం తేల్చేస్తే, ఆ ప్రకారం తల ఒకటికి లెక్క గట్టి మొత్తం అంతా మీకు ముట్ట చెబుతాం. చూడండి — చిన్న చెట్లకు వేరు, పెద్ద చెట్లకు వేరు, పనికొచ్చే వాటికి వేరు, పనికి రాని వాటికి వేరు — ఇలా మీరు నిర్ణయించుకుని మరీ చెప్పండి. ఇంకా ఏమైనా కావలసి ఉంటే గూడెంలో మాట్లాడుకుందాం" అన్నారు.

"భూమినీ, వేరునూ వేరు చేయడానికికూడా వేరు వేరు రేట్లు చెబుతున్నారే!" అని చమత్కరించాడు రంగనాథం. అయినా కరణంగారు నవ్వలేదు,

రంగనాథమే మళ్ళీ అన్నాడు: "చూడండి నాకు ఏ రేటూ అక్కర్లేదు. మీకు కావలసిన సర్వే రిపోర్టు అంతా రెడీ చేసి పెడతాను. సరేనా? ప్రభుత్వం నాకు అప్పగించిన బాధ్యతను పూర్తిగా సక్రమంగా నెరవేరుస్తాను. మీలో ఎవరికీ నిరుత్సాహం కలిగించను."

"సంతోషం, బాబూ, అదే మాకు కావలసింది!" అంటూ తృప్తిగా బయటికి నడిచారు కరణంగారు.

రంగనాథం పని చురుకుగా చేస్తున్నాడు. చెట్లన్నీ తరహాలుగా విభజించి, నేలమట్టం అయిపోయేవన్నీ వాటికి ప్రభుత్వం వారు కట్టిన రేట్లూ జాగ్రత్తగా లిస్టులో వ్రాసుకుంటున్నాడు. ఎవరెవరి పొలాల్లో ఎన్నెన్ని చెట్లున్నాయో, ఏ చెట్టుకు ప్రభుత్వం వారి రేటు ప్రకారం ఎంత ఇవ్వాలో, మొత్తం తల ఒక్కంటికీ ఎంతెంత వస్తుందో అన్నీ చకచక పేపర్లోకి ఎక్కించుకుంటున్నాడు. చిన్న చిన్న పొదలను గుబురులను కూడా వదలడం లేదు. కొన్ని మంచి మంచి పూలమొక్కలేమైనా ఉంటే అడిగిన వాళ్ళకూ, మిత్రులకూ పంచి పెడుతున్నాడు, అవి లెక్కలోకి రావు కనక.

ప్రభుత్వం స్వాధీనం చేసుకోబోయే భూమిలో అన్ని చెట్లనూ కొట్టించేసి, ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళకు కలప కింద అప్పగిస్తే, దాన్ని వాళ్ళు కాంట్రాక్టరులకు వేలం వేస్తారు. ఆ విధంగా ఈ నష్ట పరిహారాన్ని కొంతవరకైనా భర్తీ చేయవచ్చని ప్రభుత్వం వారి యోచన. ప్రభుత్వం చదును చేసిన భూమిలో ప్రస్తుతం జలాశయ నిర్మాణం చేపట్టిన సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక గృహాలను నిర్మించి ఆ స్థలాన్ని ఉపయోగించుకుంటారు.

రంగనాథం పనంతా పూర్తి అయిపోయింది. మరునటి రోజు బుల్‌డోజర్లు వస్తాయి. పెద్ద పెద్ద చెట్లన్నీ నరికి వేయడానికి సన్నాహాలు పూర్తి అయ్యాయి. రంగనాథం పని తీరును కోయలూ, చెంచులూ, కరణంగారూ, అధికారంలో ఉన్న పెద్దలూ అందరూ మెచ్చుకున్నారు. అతను వద్దన్నా అతనిని ఏదో విధంగా సత్కరించాలని ఆ గూడెం వాళ్ళంతా అనుకున్నారు.

* * * *

రంగనాథం పని పూర్తి చేసుకుని సాయంత్రం గదిలో చేరాడు. ఒకసారి ఆ కోయవాళ్ళ, చెంచు వాళ్ళ స్థితిని తలుచుకున్నాడు. డబ్బు ఇవాళ వీళ్ళ చేతులో ఉంటుంది. రేపు ఎవరి చేతుల్లో ఉంటుందో! కష్టపడి పని చేసుకోవడమే తప్ప, డబ్బుతో ఉండే సుఖాన్ని ఎన్నడూ ఎరగని వాళ్ళు. ఈ డబ్బును వీళ్ళు ఏం చేసుకుంటారో? వీళ్ళు మళ్ళీ పొలాలు కొనుక్కోవాలంటే ఎంత రేటు పెడతారో? ఎలా బేరసారాలు చేస్తారో? వీళ్ళకూ, బయటి ప్రపంచానికీ మధ్య—మధ్య వర్తులెంత మంది ఉంటారో?

ఆకాశంలోంచి హాయిగా ఎగిరే పక్షులూ, పిట్టలూ చెట్లలో ఉన్న గూళ్ళలోకి చేరుకుంటున్నాయి. ఆ పక్షులన్నీ సూర్యోదయంతోనే లేచి రెక్కలల్లార్చుకుంటూ వెళ్ళిపోతాయి సామూహికంగా,గుంపులుగా. తిరిగి మరునాడు సాయంత్రం రావడం తోనే వాటికి గూడు దొరకదు కదా? ఎంతగా విల విల లాడి పోతాయో!

రంగనాథం గుండె ఝల్లుమంది. భగవంతుడా! వీళ్ళుకూడా ఈ పక్షుల లాగే, పిట్టల్లాగే నిరాశ్రయులు కాకుండా నీవే కాపాడాలి!' అని మనసారా కోరుకున్నాడు. తను చేయబోయే పని ఎన్ని ఎన్ని మూగ జీవాలు నిరాశ్రయమై పోతాయో! అన్న బాధ కలిగింది. భగవంతుడు ఆ మూగ జీవాలకు కల్పించిన రక్షణ తాను చేచేతులా నాశనం చేస్తున్నాడు. అదీ కొందరి పంపకాల కోసం!

విధ్యుక్త ధర్మ నిర్వహణలో పాప పుణ్యాల ప్రసక్తి ఎటూ లేదు కాబట్టి తనకు తన అంతరాత్మ చెప్పిందే ప్రబోధంగా, గీతోపదేశంగా భావించి, చెట్లు తనచేతుల మీదుగా నరక కూడదని గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు. ఈ పరిస్థితులలో నరికి వేయడం తనకు తప్పని సరి అయింది కాబట్టి ఒక నిర్ణయానికి వచ్చాడు.

తెల వారుజామునే లేచి, జీప్‌లో వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళి, పై అధికారికి రాజీనామా లేఖను సమర్పిస్తూ, ఆ చెట్లన్నీ నరికి వేయడానికి తన మనసు ఒప్పటం లేదని కన్నుల్లో నీరు చిమ్ముతూండగా తన బాధను చెప్పుకున్నాడు రంగనాథం.

రంగనాథం పరిస్థితి గమనించి, అతని బాధను అర్థం చేసుకుని,రాజీనామాను ఒప్పుకోనక సానుభూతితో అతనిని చెట్లు నరికే ఆ డిపార్టుమెంటునుండి చెట్లను పెంచే మరో డిపార్టుమెంటుకు బదిలీ చేశారు, ఆ చెట్లను నరకడం తాత్కాలికంగా నిలుపు చేస్తూ.

రంగనాథం ఇక అటు వైపు వెళ్ళలేదు. *

